ఓటర్ల తుది జాబితా విడుదల
» జిల్లావ్యాప్తంగా 16లక్షల 34వేల ఓటర్లు
» పెండింగ్ ఫారం-6ను పరిష్కరించిన ఆర్వోలు
- 7లో

పవన్‌కు మద్దతుగా
మెగాప్రిన్స్ వరుణ్‌తేజ్ ప్రచారం
- 6లో


నువ్వు కావాలయ్యా.. నువ్వు రావాలయ్యా : కాకినాడ రూరల్‌లో పవన్ రోడ్ షో


అభిమాన పవనాలు : కాకినాడ రూరల్ ఇంద్రపాలెంలో సభకు హాజరైన జనం


రాత్రయినా తరగని అభిమానం : సామర్లకోటలో సభకు హాజరైన జనం
సమస్యలివే సార్ : పవన్‌తో మాట్లాడుతున్న పిల్లి సత్యనారాయణమూర్తి
మా గుండెల నిండా నువ్వే పవనన్నా...
కాకినాడ రూరల్ రోడ్ షోలో పవన్ అభివాదం

జన కెరటం..


కూటమికే ఓటేయండి : అభ్యర్థులు పంతం నానాజీ, ఉదయ్ శ్రీనివాస్‌లతో కలిసి పవన్ అభివాదం


గుర్తు పెట్టుకోండి.. మరచిపోవద్దు : పెద్దాపురంలో పవన్‌తో కలిసి గుర్తులను చూపుతున్న అభ్యర్థులు ఉదయ్‌శ్రీనివాస్, నిమ్మకాయల చినరాజప్ప


తమ్మవరం రైతులకు జగన్ మోసంపై సభలో ఫ్లెక్సీ

- » పవన్ వారాహియాత్రకు జన సునామీ
- » కాకినాడ రూరల్, సామర్లకోటల్లో సభలు
- » వైసీపీ నాయకుల తీరుపై తీవ్ర ఆగ్రహం
- » కూటమిని గెలిపించాలని విన్నపం
- » బాధితులకు న్యాయం చేస్తామని హామీ

సర్పవరం జంక్షన్/కాకినాడ రూరల్/పెద్దాపురం/సామర్లకోట, ఏప్రిల్ 27: 'రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన అంతం కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం సొంత పార్టీ ప్రయోజనాలనే పణంగా పెట్టి, అనుభవం ఉన్న చంద్రబాబుకు మద్దతు ఇచ్చినవాడిని.. ఏ ఒక్క కులాలకో పరిమితం కాను. అన్ని కులాల ప్రయోజనాల కోసం పాటుపడతా. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి గెలిపించాలి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కోరారు. కాకినాడ రూరల్ ఇంద్రపాలెం ముసలమ్మతల్లి ఆలయం వద్ద కాకినాడ రూరల్ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు(నానాజీ)ఆధ్వర్యంలో శనివారం రాత్రి వారాహి యాత్ర నిర్వహించారు. పవన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టేబోయే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలపై తీవ్ర విమర్శలు చేశారు. డొక్కు స్కూటర్‌తో సమాచారం కావాలంటే మా ఇంటికి వచ్చే కన్నబాబు అక్రమాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడి రూ.వెయ్యి కోట్ల అక్రమార్జనకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆస్తి తగాదా పేరు చెప్పి యువ డాక్టర్ ఆత్మహత్యకు కారణమైన దుర్మార్గుడు అని ఆరోపించారు.వాకలపూడిలో 20 మందికి చెందిన 4.86 ఎకరాల భూమిని కడప జిల్లాకు చెందిన రెడ్లు కొట్టేయడంలో సహకరించారన్నారు.తమ్మవరం రైతుల నుంచి ఏపీఐఐసీ సేకరించిన 298 ఎకరాల భూమిని వెనక్కి ఇప్పిస్తానని హామీ ఇచ్చి సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబు రైతులను మోసగించారన్నారు. కన్నబాబు కమిషన్లు తీసుకుంటూ దందాలకు పాల్పడుతున్నారన్నారు. కేవలం కమీషన్ కోసం కొంగోడు బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకున్న ఘనుడన్నారు. సూర్యారావుపేటలో మత్స్యకారుల ఇళ్లను ఖాళీ చేయించి తిరిగి స్థలాలివ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అక్ర మాలు మర్చిపోలేదన్నారు. రాష్ట్ర శ్రేయస్సు, యువత భవిష్యత్తు కోసం గాజుగ్లాసు గుర్తులపై రెండు ఓట్లేసి ఎమ్మెల్యేగా పంతం నానాజీ, ఎంపీగా తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. టీడీపీకి చెందిన సీనియర్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులను పవన్ ప్రశంసించారు.సభలో ఎన్నికల కోఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు,కె.బాబీ, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, డాక్టర్ బొండా సూర్యారావు, కాకరపల్లి చలపతి, రాందేవు సీతయ్యదొర, పెంకే శ్రీనివాస్‌బాబా పాల్గొన్నారు.

ఐదేళ్ల పాలన.. ఆరు పరిశ్రమల మూత

శత సంవత్సరాల చరిత్ర గల సామర్లకోట డెక్కన్ షుగర్ ఫ్యాక్టరీ, సగ్గుబియ్యం పరిశ్రమ, నాలుగు సహకార చక్కెర కర్మాగారాలు ఐదేళ్ల వైసీపీ పాలనలోనే మూతపడ్డాయని పవన్ కల్యాణ్ అన్నారు. పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట పట్టణ రింగ్ సెంటర్‌లో శనివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాజానగరం నుంచి కాకినాడ వరకూ ఉన్న ఏడీబీ రోడ్డులో స్వయంగా ప్రయాణించి ప్రజల కష్టాలు తెలుసుకున్నానన్నారు.రానున్న కూటమి ప్రభుత్వంలో రోడ్లను అభివృద్ధి చేసే బాధ్యతను జనసేన తరపున తాను స్వీకరిస్తానన్నారు. స్థానికంగా 100 పడకల ఆస్పత్రిని నిర్మించి మెరుగైన వైద్యం అందిస్తానన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, పెద్దాపురం వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు కలిసి 600 ఎకరాల రామేశం మెట్టను పూర్తిగా నేలమట్టం చేశారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ప్రతి వైసీపీ నాయకుడిని రామేశంమెట్టలో మోకాలిపై నడిపిస్తామంటూ హెచ్చరించారు.పెద్దాపురం నియోజకవర్గంలో 55 ఎకరాల్లో 20,040 మందికి స్థలాలిస్తే వాటిలో 1,019 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. సామర్లకోట, పెద్దాపురం పట్టణాలకు గోదావరి జలాలను అందిస్తామని జగన్ ఇచ్చిన హామీ ఏమైందన్నారు. ఎస్సీలు తమ పథకాలను ఎందుకు నిలిపివేశారో నిలదీయాలన్నారు. ఎమ్మెల్సీ దళిత డ్రైవర్‌ను హతమార్చి డోర్ డెలివరీ చేస్తే దళితులు ఎందుకు వైసీపీకి ఓటు వేయాలి అని సునీల్‌ను ప్రశ్నించారు. ఓటమి పొందే పార్టీలోకి మారడం సునీల్ నైజమన్నారు.

యువతకు ఉపాధి కల్పిస్తాం..

కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

కాకినాడ జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని యువతకు ఉపాధి కల్పిస్తా. కాకినాడ పోర్టును అభివృద్ధి చేస్తా. ఏడీబీ రహదారిని గుంతలమయంగా మార్చేసిన ఘనత వైసీపీదే. ఫుడ్ పార్కును గాలికొదిలేశారు. ఏఒక్క పరిశ్రమా రాలేదు. కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తెచ్చి పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తా.

ఇళ్ల పట్టాల పేరుతో పేదలకు మోసం

కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీ

కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వంలో నకిలీ ఇళ్లపట్టాలిచ్చారు. స్వామినగర్‌లోఇళ్లపట్టాల పేరుతో పేదలను మోసగించారు. జయలక్ష్మి సహకార సొసైటీ స్కామ్‌లో వైసీపీ నాయకుల పాత్ర ఉంది. రూరల్‌లోని గ్రామాల్లో వైద్యం మీద ప్రత్యేక దృష్టి పెడతాం. కాకినాడ బీచ్‌ను సుందరంగా చేస్తాం.

రాష్ట్రం కోసం ఆలోచించే కూటమి

పెద్దాపురం టీడీపీ అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైంది. ఇది గుర్తించి కూటమిగా ఏర్పడాలని భావించిన వ్యక్తి పవన్. అందరినీ ఒప్పించి కూటమి ఏర్పాటు చేశారు. 2019లో నేను విజయం సాధించినా నన్ను పనిచేయనివ్వకుండా వైసీపీ నాయకులు అడ్డుకున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి ఒక్క రూపాయి ఇవ్వకుండా మోసాలు చేసి సంపద దోచుకున్నారు.

పాతపాటే!

- » కూటమి సూపర్ సిక్స్ ముందు తుస్సుమన్న వైసీపీ మేనిఫెస్టో
- » విస్తుబోయిన నేతలు.. డీలాపడిన సొంత పార్టీ శ్రేణులు..
- » ఉద్యోగులు, నిరుద్యోగులు, యువతకు జగన్ మొండిచెయ్యి
- » బీసీ, ముస్లిం, మైనారిటీల రిజర్వేషన్ల ఊసూ లేదు
- » పోలవరానికి మరో అయిదేళ్లూ కావాలట
- » పింఛనుదారులకు గత ఎన్నికల నాటి తంతే ఈసారీ
- » 2028లో రూ.250, 2029లో రూ.250 పెంచుతామని మెలిక
- » ఇప్పటికే రూ.4 వేలు పింఛను ఇస్తామని టీడీపీ కూటమి ప్రకటన
- » దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని మరో అద్భుత వరం
- » మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తామన్న చంద్రబాబు
- » బీసీల రిజర్వేషన్లు 34 శాతానికి పెంపు.. ప్రత్యేక రక్షణ చట్టం
- » పథకాలతో కూటమిలో జోష్.. మేనిఫెస్టోతో వైసీపీ కేడర్ డీలా



ఈసారి ఎన్నికల వైసీపీ మేనిఫెస్టో తుస్సుమంది. కొద్దిరోజులుగా జగన్ ప్రకటించే మేనిఫెస్టోపై రకరకాల ఊహాగానాలను ఆ పార్టీ నేతలు ప్రచారంలోకి తెచ్చారు. అభ్యర్థుల ప్రచార సమయంలో కూడా ఓటర్లకు పింఛన్లు భారీగా పెంచుతామని, యువతకు ఉద్యోగాలంటూ నేరుగా చెబుతూ వచ్చారు. తీరా మేనిఫెస్టో విడుదలైన తర్వాత ఆ పార్టీ వారికే మింగుడుపడడం లేదు. గత ఎన్నికల్లో మాదిరే ఈసారీ 'పెంచుకుంటూ పోతాం' అనే పల్లవినే జగన్ అందుకోవడం విశేషం. గత ఎన్నికల సమయంలో పింఛన్ల ప్రకటనలో కూడా ఇదే గందరగోళం సృష్టించారు. పెంచుకుంటూ పోతామనే దానికి అర్థం ఏమిటో పింఛనుదార్లకు తర్వాతగానీ బోధపడలేదు. ఈసారీ అదే పల్లవి అందుకోవడంతో గత హామీ అమలును గుర్తుచేస్తున్నారు. కొత్తగా వైసీపీ మేనిఫెస్టోలో ఏ పథకాలు లేకపోగా, టీడీపీ



ఏడాదికాలం కింద ప్రకటించిన సూపర్ సిక్స్ పేరిట జనం నోళ్లలో నానుతున్న పథకాలతో పోల్చి మాట్లాడుకుంటున్నారు. ముఖ్యంగా పింఛన్ల పెంపు, 20 లక్షల ఉద్యోగాల కల్పన, మహాశక్తి పథకాలపై చర్చ జరుగుతోంది.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఈసారి మేనిఫెస్టో రూపకల్పనలోనే వైసీపీ బోల్తాపడింది. ప్రజలకు కొత్తగా ఒక హామీ కూడా ఇవ్వలేకపోయారు. దీంతో ఎన్నో ఊహాగానాలు అల్లుకున్న ఆ పార్టీ కేడర్ సైతం డీలా పడిపోయింది. శనివారం ప్రకటించిన వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ మేనిఫెస్టో ముందు బోల్తాపడింది. గతంలోని పథకాలకే కొన్ని రంగులు పులిమి, నవరత్నాలు పేరిట ఉన్న పథకాలనే కొనసాగిస్తామని చెబుతూ రెండు పేజీలతో సరిపెట్టారు. నిజానికి ఆనాటి హామీలు కూడా పూర్తిస్థాయిలో అమలుకాలేదు. అలాగే ఆయా పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యను కుదించి, అరకొరగా అమలుచేశారు. దీంతో అర్హులెందరికో లబ్ధి చేకూరలేదు. ఆదిలోనే పింఛను విషయంలో బురిడీ కొట్టించిన వైనాన్ని పలువురు గుర్తుచేస్తున్నారు. మూడు వేల పింఛను ఇస్తామని.. ఏడాదికి రూ.250 ఇవ్వడంపై లబ్ధిదారులు ఇప్పటికే గుర్రుగా ఉన్నారు. ప్రస్తుత మేనిఫెస్టోలో కూడా ఇదే పాట పాడగా, రూ.500 మాత్రమే పెంచి అది కూడా చివరి రెండు ఏళ్లలో పెంచుతామని మెలిక పెట్టారు. అంటే పెన్షన్ల సొమ్ము ఈ ఏడాది పెంచరట. వచ్చే ఏడాది 2025లో పెంచరు. 2026, 2027లోనూ పెంచరు. ఎన్నికల చివరి ఏడాది అంటే 2028లో రూ.250, ఎన్నికల ఏడాది 2029లో రూ.250 పెంచి మొత్తం రూ.3,500 చేస్తారట. ఈ ప్రకటన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర కేటగిరీల కింద పెన్షన్ పొందుతున్న వారిలో తీవ్ర ఆవేదన మిగిల్చింది. ఆగ్రహానికి గురిచేసింది. దివ్యాంగులకు వైసీపీ పాలనలో తీరని అన్యాయం చేశారు. వారికి ఒక్క రూపాయి కూడా పెంచలేదు. ఇప్పుడూ వారి మాట మరిచారు. ఇక టీడీపీ ఏడాది కిందటే సూపర్ సిక్స్ పేరిట ప్రజలకు అనేక వరాలిచ్చింది. ఇప్పుడు కూటమి తరపున కూడా ఈ పథకాలను ఇస్తామంటూ చంద్రబాబు, పవన్ భరోసా ఇచ్చారు. అందులో నెలకు రూ.4 వేల పింఛన్.. అది కూడా ఏప్రిల్ నుంచే లెక్కకట్టి, జూలై నెలలో ఏకంగా ఏడు వేలు ఇస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. దివ్యాంగులకు నెలకు రూ.ఆరు వేలు ఇస్తానని స్పష్టంచేశారు. ఇక వైసీపీ అధికారంలోకి రాగానే స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించింది. దీంతో వేలాది మంది బీసీలు స్థానిక సంస్థల్లో పదవులు కోల్పోయారు. కానీ జగన్ మేనిఫెస్టోలో ఆ ఊసే లేదు. టీడీపీ కూటమి మాత్రం బీసీల రిజర్వేషన్లు 34 శాతానికి పెంచుతామని స్పష్టంచేసింది. అలాగే బీసీలకు కూడా రక్షణ చట్టం తీసుకొస్తామని సూపర్ సిక్స్‌లో ప్రకటించారు. బీసీ రిజర్వేషన్లు, బీసీ రక్షణ చట్టంపై ప్రధానంగా ఆయా వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక మహిళల విషయంలో కూడా పాతపాటే. ఎంతో చేశానని, అదే మళ్లీ చేసేస్తానని జగన్ చెప్పారు. ఇది కూడా మహిళల్లో మరింత అసంతృప్తిని రేపింది. బటన్ నొక్కిన కొన్ని నెలలకు కొంత జమ చేస్తూ ఈ ఐదేళ్లు మహిళలను ఇబ్బంది పెట్టిన సంగతి తెలిసిందే. ఇవాళ టీడీపీ కూటమి మహిళలకు మహాశక్తి పథకం అమలుచేయనుంది. ఆడబిడ్డ నిధి కింద ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమంది మహిళలకు నెలకు రూ.1500 ఇస్తారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు వారికి ఏడాదికి రూ.15వేల వంతున ఇస్తామని ప్రకటించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని, మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామని కూటమి ప్రకటించింది. ఇక రైతులకు ఏడాది రూ.20 వేలు పంట పెట్టుబడికి ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఇలా అన్నివర్గాల సంక్షేమంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామనే కూటమి వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ఇవాళ జగనన్న ఇళ్లు పేరిట కేవలం సెంటు భూమి పనికిరాని భూముల్లో ఇవ్వగా, తాము 3 సెంట్ల భూమి ఇచ్చి.. ఇల్లు మంజూరు చేస్తామని కూటమి నేతలు చెబుతున్నారు. 2019కే పూర్తి కావలసిన పోలవరాన్ని ఐదేళ్లలో గాలికి వదిలేసిన జగన్, దీని నిర్మాణానికి మరో ఐదేళ్లు కావాలని మేనిఫెస్టోలో పెట్టడాన్ని జనం ఆక్షేపిస్తున్నారు. తిరకాసు, మోసపూరిత హామీలతో బురిడీ కొట్టించాలని చూస్తే.. జనం నమ్మరని జగన్ మేనిఫెస్టోపై పలువురు వ్యాఖ్యానించారు.

ఒరిగేదేం లేదు...



వైసీపీ మేనిఫెస్టో నిరాశపరిచింది. దీనివల్ల ప్రజలకు కొత్తగా ఒరిగేది ఏం లేదు. అవ్వాతాతలకు రూ.4 వేల పింఛను ఇస్తానని చంద్రబాబు ప్రకటించారు. సూపర్ సిక్స్ పథకాలు అందరికీ మేలు చేకూరుస్తాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ప్రతి నెలా ఆర్థిక చేయూత ఇస్తామని బాబు హామీ ఇచ్చారు.

- కరుటూరి విశ్వేశ్వరి, అంకంపాలెం

చంద్రబాబు హయాంలోనే బాగు



ప్రతీ ఇంటికీ పింఛన్, ఇల్లు, రేషన్‌కార్డులు వంటి పథకాలు చంద్రబాబు ప్రభుత్వం హయాంలో కూడా అమలుచేశారు. కొత్తగా జగన్ ప్రభుత్వంలో ఒరగబెట్టింది లేదు.

- సత్యవతి, సామర్లకోట

అంతా మోసమే..



ఒక ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ గత ఎన్నికల మేనిఫెస్టోలో 95 శాతం పూర్తి చేశానని చెప్పి ప్రజల్ని మోసం చేశారు. యువకులు నిరుద్యోగంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రజలకు ఏదీ అందలేదు.

- సత్తిరాజు ఆదిత్యకిరణ్, కొత్తపేట

వై.. చీప్ రాజకీయం!




పిఠాపురంలో పట్టుబడిన మద్యం


- » ఎన్నికల వేళ.. వైసీపీ మద్యం స్కీమ్
- » గోవా నుంచి గోదావరికి అక్రమ మద్యం
- » భారీగా కంటెయినర్లలో డంప్
- » లోకల్‌గానూ తయారీ
- » అన్ని నియోజకవర్గాలకు సరఫరా
- » పిఠాపురం, కాకినాడల్లో పట్టివేత
- » తూతూ మంత్రంగా కేసులు

పిఠాపురం, ఏప్రిల్ 27: వైసీపీ నాయకులా మజాకానా.. టక్కుటమార విద్యల్లో ఆరితేరిన వారు.. అందుకే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చీపు రాజకీయానికి తెరలేపుతున్నారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు భారీగా మద్యం నిల్వలు తెచ్చి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిల్వ చేస్తోంది. గోవా మద్యంతో పాటు రాష్ట్రంలోనూ తయారు చేసి అవే లేబుల్స్ ఉన్న సీసాల్లో నింపుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఇప్పటికే కాకినాడ, పిఠాపురంలలో భారీగా మద్యం డంప్‌లు బయటపడ్డాయి. విలువ రూ.1.50 కోట్లకు పైగా ఉంది. ఇంతకు వంద రెట్లు అధికంగా కాకినాడ జిల్లాకు మద్యం నిల్వలు చేరినట్టు సమాచారం.

బరితెగించిన వైసీపీ నేతలు..

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగియకుండానే జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. వైసీపీ నేతలు బరితెగించి భారీగా మద్యం పంపిణీ చేస్తున్నారు. గోవా నుంచి కంటెయినర్ల ద్వారా మద్యం జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నట్టు సమాచారం. అంతే కాకుండా గోవా మద్యం సీసాల్లో రాష్ట్రంలోని రెండు ఫ్యాక్టరీల్లో తయారైన మద్యాన్ని నింపి ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్టు సమాచారం. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురంతో పాటు కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజవర్గాలకు ఇప్పటికే భారీ మద్యం నిల్వలు చేరాయి. ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.5 నుంచి రూ.పది కోట్లు విలువైన మద్యాన్ని చేర్చినట్టు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా అక్రమంగా తీసుకువచ్చినట్టు చెబుతున్నారు.

పట్టుబడిన మద్యం బ్రాండ్లు ఇవే



పిఠాపురం నియోజకవర్గంలో జరిగిన దాడుల్లో పట్టుబడిన మద్యం బ్రాండ్లు అన్నీ గోవా తయారీ మద్యం బ్రాండ్లుగా చెబుతున్నారు. ఇవన్నీ ఎన్‌డీపీఎల్ లిక్కర్ కావడంతో కేసు తీవ్రత అధికంగా ఉంటుంది. పట్టుబడిన వాటిలో రాయల్ బ్లూ, గోవా కిక్ విస్కీ, బొంబాయి సెంట్రల్ క్లాసిక్ టోటల్ విస్కీ, గోవా క్విక్ ఫైనెస్ట్ సుపీరియర్ విస్కీ,యూకే నెంబరు 1 రేర్ విస్కీ, రాయల్ స్టైల్ విస్కీ, గోవా విస్కీ బ్రాండ్లు ఉన్నాయి.ఇప్పుడు ఇవి ఎక్కడ తయారయ్యాయి, వీటిని ఎలా తరలించారు, ఎవరు తరలించమన్నారు తదితర విషయాలపై దర్యాప్తు చేయాల్సిన పోలీసు,సెబ్ అధికారులు అసలు విషయాన్ని వదిలి తూతూమంత్రంగా నాలుగుచోట్ల ఒక్కొక్కరిపై కేసులు నమోదు చేసినట్టు చెబుతున్నారు. ఇప్పటికే ఇంత భారీగా మద్యం నియోజకవర్గాలకు తరలించిన వైసీపీ రానున్న రోజుల్లో ఇక ఎన్ని కుట్రలకు తెరలేపుతుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీ కీలక నేతల ఫ్యాక్టరీల్లోనే..

ఈ అక్రమ మద్యం వ్యవహారంలో రాష్ట్రానికి చెందిన వైసీపీ ఎంపీలుగా ఉన్న ఇద్దరు నేతలు, కాకినాడ జిల్లా కేంద్రం కీలక నేత ఒకరు కీలకపాత్ర పోషించినట్టు చెబుతున్నారు. ఆ ఇద్దరు ఎంపీలకు లిక్కర్ తయారీ యూనిట్లు ఉండడంతో అక్కడ ఈ మద్యాన్ని తయారు చేయించి గోవా బ్రాండ్ల స్టిక్కర్లు అంటించి ఉన్న సీసాల్లోకి నింపినట్టు చెబుతున్నారు. గోవా మద్యంతో పాటు అంతకు రెండింతలు లోకల్ మద్యం వివిధ ప్రాంతాలకు డంప్ చేసినట్టు చెబుతున్నారు. పిఠాపురం పట్టణంలోని మూడు చోట్ల, కుమారపురంలో ఒక చోట గృహాల్లో డంప్‌లపై ఎస్ఈబీ, పోలీసు అధికారులు దాడులు చేశారు. ఇక్కడ ఏకంగా 52,992 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.కోటి పైగా ఉంటుందని అంచనా. కాకినాడలోనూ మద్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారు.వీటి విలువ రూ.50 లక్షలు ఉంటుంది.రెండు చోట్ల పట్టుబడిన మద్యం చాలా తక్కువని, ఇంతకు వంద రెట్లు నిల్వలు ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.

ఓటర్లను మద్యంతో ముంచెత్తడమే లక్ష్యంగా

ఓటర్లను మద్యం మత్తులో ముంచేయాలని వైసీపీ నేతలు ముందు నుంచీ భావిస్తున్నారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో మద్యం పంపిణీ ప్రారంభమైంది. ప్రస్తుతం ప్రతి రోజు మద్యం పంపిణీ చేయాలని, పోలింగ్ చివరి ఐదు రోజులు ప్రజలు కోరినంత మద్యం పంపిణీ చేయాలని వైసీపీ పెద్దలు నియోజకవర్గాల నేతలకు చెప్పినట్టు సమాచారం.పిఠాపురంలో పవన్‌ను ఓడించాలనే లక్ష్యంతో ఉన్న వైసీపీ అధినాయకత్వం అక్కడ మద్యాన్ని ఏరులై పారించాలని పన్నాగం పన్నినట్టు ఇతర పార్టీల అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కాకినాడ, పిఠాపురంలలో మద్యం నిల్వలు పట్టుబడిన నేపథ్యంలో రెండు, మూడు రోజుల పాటు లిక్కర్ పంపిణీకి వైసీపీ నేతలు తాత్కాలికంగా ఫులిస్టాప్ పెట్టారు. అంతే కాకుండా వైసీపీ నేతలు తమ మద్యం నిల్వలను దూర ప్రాంతాలకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. సెబ్, పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తే మరింత భారీగా నిల్వలు బయటపడతాయని అందరు భావిస్తున్నా ఆ దిశగా అడు గులు వేస్తున్నట్టు లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.


రాగంపేటలో మూసేసిన మద్యం దుకాణం



మద్యం దందా

ఎక్కడికక్కడ రహస్య ప్రదేశాల్లో మద్యం డంప్
ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వైసీపీ ఎర
ఉమ్మడి జిల్లాలోకి గోవా మద్యం దిగుమతి

ఇవేం బ్రాండ్లు..!

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 27 : వైసీపీ పాలనలో రకరకాల మద్యం బ్రాండ్లు తెచ్చి నాణ్యత లేని సరుకుతో మద్యంబాబులను ఇష్టానుసారం దోచుకున్న విషయం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను మద్యంతో ప్రలోభపెట్టడానికి ఇప్పటికే కావలసినంత సరుకును రహస్య శిబిరాల్లో ఆ పార్టీ డంపు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. రాజమహేంద్రవరం పరిధిలోని దివాన్ చెరువు ప్రాంతంలో అంగన్‌వాడీ పాలప్యాకెట్ల పేరిట ఓ పెద్ద లారీ సరుకును డంప్ చేసినట్టు తాజా సమాచారం. ప్రస్తుతం మార్కెట్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సరుకు దొరకని విధంగా ఇప్పటికే కొరత సృష్టించింది. గత ఏడాది కంటే అమ్మకాలు 30 శాతం కంటే ఎక్కువ ఉండకూడదని, అందువల్లే షాపుల్లో సరుకు తగ్గించామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో తమ వద్ద భారీగా నిల్వలు ఉంచిన మద్యాన్ని ఓటర్లకు ఎరగా వేసే ప్రయత్నాలు వైసీపీ నేతలు మొదలుపెట్టారు. పోలింగ్ దగ్గరపడే సమయానికి పెద్దఎత్తున మద్యం పంపిణీ చేసేందుకు వీలుగా ఎక్కడికక్కడ మద్యం నిల్వలను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది.

గోవా సరుకు..!

ఆత్రేయపురం, ఏప్రిల్ 27: ప్రస్తుత ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రెండు నెలల ముందే పెద్దఎత్తున గోవా మద్యం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోకి దిగుమతి అయింది. ప్రాంతాల వారీగా ఎక్కడికక్కడ గొడౌన్లలో నిల్వలు దాచారు. గోవాలో ఏ బ్రాండ్ కావాలని అడిగితే ఆ బ్రాండ్ స్టిక్కర్‌తో ఆల్కహాల్ శాతం తక్కువగా ఉన్న చీప్‌లిక్కర్‌తో తయారుచేసే మాఫియా ఉన్నట్టు చెబుతున్నారు. అలా ఒక లారీకి బాక్స్‌కు 48 బాటిల్స్ చొప్పున 600 నుంచి 1200 బాక్సులు లారీల ద్వారా గోవా లిక్కర్ గ్యాంగ్‌లు జిల్లాకు తీసుకువచ్చి ఆర్డర్ చేసిన వారికి అప్పగిస్తారు. లారీ చీప్ లిక్కర్ రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేస్తారు. ఈ దందా సాగించే స్థానిక వ్యాపారులు మూడు రెట్లు వేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం చీప్ లిక్కర్ ధర రూ.130 ధర ఉండగా గోవా బాటిల్ రూ.60కే లభిస్తుంది. నిజానికి ఈ దందా సాగాలంటే మూమూలు రోజుల్లో కష్టం. పోలీసులు, సెబ్ అధికారులు చూడీచూడనట్టు ఉంటేనే వీలవుతుంది. ప్రభుత్వ పెద్దల సహకారంతోనే భారీ ఎత్తున గోవా మద్యం ఇక్కడకు డంప్ అయినట్టు సమాచారం.

దుకాణాల్లో నియంత్రణ

గండేపల్లి, ఏప్రిల్ 27: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిననాటి నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలపై ఎన్నికల అధికారులు ఆంక్షలు విధించారు. ఒక్కొక్కరికి ఒక్కో బాటిల్ మాత్రమే మద్యం అమ్మాలని నిబంధన పెట్టారు. దీంతో సాయంత్రానికే మద్యం టార్గెట్‌లు అయిపోవడంతో దుకాణాలు మూసేస్తున్నారు. ఈ మద్యం కూడా వైసీపీ నాయకుల అండతో పక్కదారి పడుతోంది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు అమ్మకాలు చేసేవారు. గత సంవత్సరం ఈరోజు ఎంత మద్యం అమ్మారో, ఇప్పుడే అంతే మద్యం అమ్మాలని నిబంధన పెట్టారు. అయితే మధ్యాహ్నానికే మద్యం అయిపోతుండడంతో సరుకంతా ఎక్కడికిపోతుందో అర్థం కావడంలేదని పలువురు నిలదీస్తున్నారు.

మద్యాన్ని స్టాకేశారు..

కొత్తపల్లి, ఏప్రిల్ 27: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం నిల్వలు చేసినట్టు సమాచారం. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం దుకాణాల్లోని సరుకును అధికార పార్టీకి చెందిన ప్రతినిధులు రాత్రి సమయాల్లో ఆయా గ్రామాలకు తరలిస్తున్నట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. గ్రత రెండు, మూడు రోజుల నుంచి ఉప్పాడ సముద్ర తీర ప్రాంతాల్లో నిల్వలు ఉంచినట్టు తెలుస్తోంది.

ఇదే దందా అంటే..

సామర్లకోట, ఏప్రిల్ 27: రోజూవారీ అమ్మకాల లక్ష్యం పూర్తయితే ప్రభుత్వ మద్యం దుకాణాలను మధ్యాహ్నానికే మూసివేస్తున్నారు. దీంతో మందుబాబులు అనివార్యంగా బెల్ట్‌షాపులను ఆశ్రయించాల్సి వస్తోంది. సదరు బెల్ట్ షాపుల నిర్వాహకులు ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందికి ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రూ.10 నుంచి రూ.20 అదనంగా చెల్లిస్తున్నారు. బెల్ట్ షాపులవారు రూ.50 లాభం చూసుకుని విక్రయిస్తున్నారు. రోజూవారీ అలవాటు ఉన్నవారు చేసేదిలేక అంతపెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఆ దందాను నియంత్రించాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి అయినా చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సామర్లకోటలో దుకాణం క్లోజ్



గొల్లప్రోలు మండలం తాటిపర్తి, వన్నెపూడి గ్రామాల పంట పొలాల మధ్య సాగుతున్న ర్యాలీ





వరుణ్‌తేజ్ రోడ్‌షో

పవన్‌కు మద్దతుగా మెగాప్రిన్స్ వరుణ్‌తేజ్ ప్రచారం
గొల్లప్రోలు మండలంలో పలు ప్రాంతాల్లో పర్యటన
భారీగా తరలివచ్చిన అభిమానులు..కూటమి కార్యకర్తలు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 27: ప్రముఖ సినీనటుడు, మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ గొల్లప్రోలు మండలం తాటిపర్తి, వన్నెపూడి, కొడవలి, చెందుర్తి, దుర్గాడ గ్రామాల్లో శనివారం రాత్రి పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించారు. ముందుగా తాటిపర్తి గ్రామంలోని అపర్ణాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం రోడ్‌షో ప్రారంభించారు. ఓపెన్‌టాప్ కారులో నిల్చుని ప్రజలకు అభివాదం చేసుకుంటూ తాటిపర్తి, వన్నెపూడి గ్రామాల్లో ప్రచారం సాగించారు. వరుణ్‌తేజ్ రోడ్‌షో ముందు భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ జరిగింది. జనసైనికులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు భారీగా తరలివచ్చారు. మహిళలు వరుణ్‌పై పూలవర్షం కురిపించారు. హారతులు ఇచ్చారు. తాటిపర్తి, వన్నెపూడి, కొడవలి, చెందుర్తి గ్రామాల మీదుగా దుర్గాడ వరకూ సాగిన రోడ్‌షోకు అపూర్వ స్పందన లభించింది. దుర్గాడలో వరుణ్ బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ఎక్కడికక్కడ ప్రజలు, మహిళలు ఇళ్ల బయటకు వచ్చి గాజుగ్లాసు చూపిస్తూ అభివాదం చేయడం విశేషం. ప్రచారంలో జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, టీడీపీ యువనేత గిరీష్‌వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

పాదగయలో పూజలు



పిఠాపురం, ఏప్రిల్ 27: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ప్రముఖ సినీనటుడు వరుణ్‌తేజ్ సందర్శించారు. తన తండ్రి, జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబుతో కలిసి పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పుర్హుతికాఅమ్మవార్లను శనివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో వరుణ్‌తేజ్ తల్లి కూడా పాల్గొన్నారు. ఆలయ విశిష్టత గురించి వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. వరుణ్‌తేజ్ రాక తెలుసుకున్న అభిమానులు, జనసైనికులు భారీగా తరలివచ్చారు. తన బాబాయి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గెలుపు కోసం పూజలు చేసినట్లు వరుణ్‌తేజ్ తెలిపారు.

మెట్టలో రాజకీయ పర్వతం

- ప్రత్తిపాడు నియోజకవర్గంలో రాజకీయ దిగ్గజ కుటుంబం
- ఒకే కుటుంబంలో ఐదుగురు ఎమ్మెల్యేలు
- పర్వత ఫ్యామిలీకి నియోజకవర్గానికి విడదీయరాని బంధం


పర్వత గుర్రాజు


పర్వత సుబ్బారావు


పర్వత బాపనమ్మ


పర్వత చిట్టిబాబు


పర్వత ప్రసాద్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 27: ప్రత్తిపాడు నియోజకవర్గ రాజకీయ చరిత్రకు పర్వత కుటుంబానికి విడదీయరాని బంధం ఉంది. రాజకీయ పదవులకు కేరాఫ్ అడ్రస్‌గా పర్వత కుటుంబం ఉంది. 14 విడతలు జరిగిన నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కుటుంబం 8 విడతలు పోటీ చేసి 5 విడతలు విజయం సాధించి 3 విడతలు ఓటమి చూసింది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో పర్వత కుటుంబం నుంచి ప్రధాన రాజకీయ పక్షం నుంచి అవకాశం ఉంటుందని పర్వత అభిమానులు భావించినా చివరికి నిరాశ మిగిలింది. ఈ ఎన్నికల్లో పర్వత కుటుంబం నుంచి ఎవరూ ఎన్నికల బరిలో లేరు. పర్వత కుటుంబానికి ఎమ్మెల్యే పదవికి ఆద్యుడు పర్వత గుర్రాజు. నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 1955లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఆయన మొట్టమొదటి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన సోదరుడు పర్వత సుబ్బారావు 1994లో టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించగా, సుబ్బారావు సతీమణి బాపనమ్మ 1999లో టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అలాగే పర్వత గుర్రాజు మరో సోదరుడు పర్వత శ్రీరామమూర్తి తనయుడు పర్వత సత్యనారాయణమూర్తి (చిట్టిబాబు) 2009లో టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అలాగే గుర్రాజు మరో సోదరుడు పర్వత కొండలరావు కుమారుడు పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ 2019లో వైసీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. ప్రస్తుతం ఆయనే ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఈ కుటుంబంలోని పర్వత శ్రీరామమూర్తి రెండో కుమారుడు పర్వత రాజబాబు ప్రస్తుతం శంఖవరం మండలాధ్యక్షుడిగా పని చేస్తున్నారు. పర్వత గుర్రాజు సోదరుడు నరసింహారావు శంఖవరం సమితికి 20 ఏళ్ల పాటు అధ్యక్షుడిగా కూడా పని చేశారు. ఆయన సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా కూడా కొనసాగారు. ఇంకా పర్వత కుటుంబీకుల్లో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ సతీమణి సత్యవేణి జడ్పీటీసీగా గతంలో పనిచేశారు. పర్వత రెడ్డి నాయుడు అన్నవరం దేవస్థానం డైరెక్టర్‌గా రెండు సార్లు నియమితులయ్యారు. ప్రస్తుతం పర్వత గుర్రాజు తనయుడు సత్యనారాయణ సొసైటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాజకీయ పదవులకు చిరునామాగా ఉండే పర్వత కుటుంబం నుంచి ప్రస్తుతం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అవకాశం లభించకపోవడం ఆ కుటుంబ అభిమానులను నిరుత్సాహానికి గురి చేసింది.

రాజకీయ ఉద్దండుల కోట కొత్తపేట

రాజకీయ ఉద్దండుల కోటగా కొత్తపేట నియోజకవర్గానికి పేరుంది. వాడపల్లి వెంకన్న, ర్యాలి జగన్మోహినీకేశవస్వామి, మందపల్లి శనేశ్వరస్వామి ఆలయాలు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. గౌతమి, వశిష్ట నదీపాయల మధ్య ఎన్నో విశిష్టతలు కలిగిన కొత్తపేట నియోజకవర్గం ఎందరో రాజకీయ నేతల ఏలుబడిలో కొనసాగింది.

వాడపల్లి వెంకన్న ఆలయం


రాజకీయ చైతన్యం

కొత్తపేట ప్రత్యేక రాజకీయ చైతన్యం కలిగిన నియోజకవర్గం. ఇక్కడ ఏ పార్టీ విజయం సాధిస్తే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం చేపడుతోంది. అయితే నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 15సార్లు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, రెడ్డి కాంగ్రెస్‌తో కలుపుకుని ఏడుసార్లు విజయం సాధించగా నాలుగుసార్లు టీడీపీ, రెండుసార్లు వైసీపీ గెలుపొందాయి.

ఓటర్ల వివరాలు

2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం 3 లక్షల 36 వేల మంది ఉన్నారు. నియోజకవర్గంలో 2,48,392 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళా ఓటర్లు 1,24,998 మంది కాగా పురుషులు 1,23,389 మంది ఉన్నారు. ఇతరులు 5గురు ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 262 ఉన్నాయి.

సమస్యలు ఇవి

ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సి ఉంది. మధ్య డెల్టాకు ఆయువుపట్టుగా ఉన్న లొల్ల, వాడపాలెం లాకుల వ్యవస్థను ఆధునీకరించి రైతుల సాగునీటి ఇబ్బందులను పరిష్కరించాల్సి ఉంది. నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు మెగా వాటర్ ప్రాజెక్టు ద్వారా సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించాల్సిన అవసరం ఎంతో ఉంది. రావులపాలెం జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మించాలి. మురుగునీరు సక్రమంగా పారేందుకు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వాడపల్లి, మందపల్లిలను టూరిజం ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి.

1955లో ఏర్పడిన ఈ నియోజకవర్గాన్ని అపర చాణక్యుడిగా పేరు పొందిన కళా వెంకట్రావు, రాజకీయ దిగ్గజం ఎంవీఎస్ సుబ్బరాజు, రాజకీయ ఉద్దండులు చిర్ల సోమసుందరరెడ్డి, బండారు సత్యానందరావు పాలించారు. పునర్విభజన తర్వాత జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గంగా మారి కోనసీమ రాజకీయాలకు కేంద్ర బిందువైంది. 1955లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో 37 గ్రామాలు ఉండగా పునర్విభజన అనంతరం 57 గ్రామాలకు చేరుకుంది. కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలతో భౌగోళికంగానే కాకుండా సామాజిక సమీకరణాల్లో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. వైసీపీ తరఫున ప్రస్తుత ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, టీడీపీ తరఫున బండారు సత్యానందరావు రాజకీయాలను శాసిస్తూ వచ్చారు. ప్రస్తుతం టీడీపీ-జనసేన-బీజేపీ కలయికతో కూటమి అభ్యర్థిగా బండారు సత్యానందరావు నుంచి సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గట్టిపోటీనే ఎదుర్కోనున్నారు.

● (కొత్తపేట)

రావులపాలెం కోనసీమ ముఖద్వారం


ఆత్రేయపురం పూతరేకులు ఖండ్రిగ పాలకోవ, రావులపాలెం కుండ బిర్యానీ ఈ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో స్పెషల్స్



రావులపాలెం-జొన్నాడ గౌతమి వంతెన


ఎమ్మెల్యేలుగా పనిచేసింది వీళ్లే..


కళా వెంకట్రావు | ఎంవీఎస్ సుబ్బరాజు | దెందులూరి భానుతిలకం
చిర్ల సోమసుందర్‌రెడ్డి | ఐఎస్ రాజు | బండారు సత్యానందరావు | చిర్ల జగ్గిరెడ్డి

సంవత్సరం	విజేత	పార్టీ
1959	కళా వెంకట్రావు	కాంగ్రెస్
1962	ఎంవీఎస్ సుబ్బరాజు	కాంగ్రెస్
1967	ఎంవీఎస్ సుబ్బరాజు	కాంగ్రెస్
1972	దెందులూరి భానుతిలకంరెడ్డి	కాంగ్రెస్
1978	ఎంవీఎస్ సుబ్బరాజు	జనతాపార్టీ
1983	చిర్ల సోమసుందరరెడ్డి	టీడీపీ
1985	ఐ.ఎస్.రాజు	టీడీపీ
1989	చిర్ల సోమసుందరరెడ్డి	కాంగ్రెస్
1984	బండారు సత్యానందరావు	టీడీపీ
1999	బండారు సత్యానందరావు	టీడీపీ
2004	చిర్ల జగ్గిరెడ్డి	కాంగ్రెస్
2009	బండారు సత్యానందరావు	ప్రజారాజ్యం
2014	చిర్ల జగ్గిరెడ్డి	వైసీపీ
2019	చిర్ల జగ్గిరెడ్డి	వైసీపీ


మద్యం నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు

మద్యం కేసును నీరుగార్చుతున్నారా?

వైసీపీ కీలక నేతను తప్పించి యువకుడిపై కేసు
రెండు చోట్ల పోలీసులు, మరో రెండు చోట్ల సెబ్‌లో కేసులు నమోదు
వైసీపీ నేతలంతా పరారీలో ఉన్నారట..!
వైసీపీ పెద్దల ఒత్తిడితో కేసు తారుమారు

పిఠాపురం, ఏప్రిల్ 27: ఏకకాలంలో నాలుగు చోట్ల దాడులు నిర్వహించి కోటి రూపాయల విలువైన గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటనలో నమోదైన కేసులను నీరుగార్చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ కీలక నేతను తప్పించి అతని వద్ద పనిచేసే కార్మికుడిపై కేసు పెట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో పెద్దల ఒత్తిడితో మద్యం నిల్వలు వెనుక ఉన్న వారిపై కేసు దర్యాప్తు వెళ్లకుండా అడ్డుపుల్ల వేసి కేసులను తారుమారు చేస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం నిల్వలు పట్టుకునే వరకూ పకడ్బందీగా వ్యవహరించిన సెబ్, పోలీసు అధికారులు రాత్రి జరిగిన పరిణామాల తర్వాత నోరు మెదిపేందుకు ఇష్టపడకపోవడం, నమోదయిన కేసుల వివరాలను రహస్యంగా ఉంచేందుకు ప్రయత్నించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పవన్ కల్యాణ్‌ను ఎలాగైనా ఓడించేందుకు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు భారీగా మద్యాన్ని డంప్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో స్టేట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసు అధికారులు పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో వట్టూరి సతీష్‌కుమార్, సాలిపేటలో అంబటి వీరవెంకట సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ గార్డెన్స్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటితో పాటు మండలంలోని కుమారపురం గ్రామంలోని వేమగిరి సువార్తమ్మ ఇళ్లపై శుక్రవారం రాత్రి ఏకకాలంలో దాడి చేశారు. నాలుగు చోట్ల కలిపి 52,992 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వైఎస్సార్ గార్డెన్స్‌లో నిర్మాణంలో ఉన్న ఇల్లు వైసీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు సోదరుడు వీరబాబుదిగా స్థానికులు తెలిపారు. మద్యం దొరికిన ఇళ్లన్ని వైసీపీ నాయకులవే కావడంతో ఆ పార్టీకి చెందిన నిల్వలుగా తేలిపోయింది. ఇక్కడ వరకూ పకడ్బందీగా వ్యవహరించిన అధికారులు రూటు మార్చారు.

కేసులు పంచుకున్నారు

నాలుగు చోట్ల దొరికిన మద్యానికి సంబంధించి పిఠాపురం పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లలో ఒక్కొక్క కేసు, సెబ్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేశారు. పట్టణంలోని జగ్గయ్యచెరువు కేసులో వట్టూరి సతీష్‌కుమార్, కుమారపురం కేసులో వేమగిరి సువార్తమ్మపై పోలీసులు కేసు నమోదు చేయగా, సెబ్ అధికారులు సాలిపేటలో పట్టుబడిన మద్యం విషయంలో అంబటి వీర వెంకట సత్యనారాయణరెడ్డిపై కేసు నమోదు చేశారు. వైఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటి విషయంలో మాత్రం అక్కడ పనిచేసే జగ్గంపేట మండలం రాజపూడికి చెందిన 20 సంవత్సరాల యువకుడు గండికోట దుర్గారామయ్యపై కేసు నమోదు చేయడం గమనార్హం. నాలుగు కేసుల్లో దొరికిన మద్యం నిల్వలు అన్ని ఒకే రకానికి చెందిన నాన్ డ్యూటీ పెయిడ్‌లిక్కర్ అయినప్పుడు కేసులు పంచుకోవడం, ఎవరి దర్యాప్తు వారు చేస్తున్నట్లు చెప్పడంతో అనుమానాలు ప్రారంభమయ్యాయి.

ఒత్తిళ్లు పనిచేశాయా?

పిఠాపురం పట్టణం, మండలంలోని కుమారపురంలో పట్టుబడిన మద్యం విషయంలో వైసీపీ పెద్దల ఒత్తిళ్లు పనిచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా కోటి రూపాయల విలువైన మద్యం పట్టుబడినప్పుడు, అది ఎన్నికల సమయంలో ఎస్పీ లేదా ఆ స్థాయి అధికారి వివరాలు వెల్లడిస్తారు. ఇక్కడ మాత్రం అది జరగలేదు. వైసీపీ పట్టణాధ్యక్షుడి బంధువులకు చెందిన ఇల్లుగా చెబుతున్నా, వారిని తప్పించి ఒక యువకుడిపై కేసు నమోదు చేయడం, అసలు సరుకు ఎవరు తెచ్చారు, ఎవ్వరు తెమ్మన్నారు, ఎక్కడి నుంచి వచ్చింది తదితర విషయాలు దర్యాప్తు చేయాల్సిన పోలీసులు, సెబ్ అధికారులు నిందితులు పరారీలో ఉన్నట్లు చెప్పి తప్పించుకోవడం ఒత్తిళ్ల ప్రభావమేనని చెబుతున్నారు. ఇది ఎన్‌డీపీఎల్ లిక్కర్ కావడంతో కేసు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అది కాకుండా నాసిరకం మద్యాన్ని స్థానికంగా తయారు చేసి గోవా మద్యం బాటిళ్లల్లో నింపారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇవి అధికారులు పట్టించుకోవడం లేదా లేక ఒత్తిడులతో పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సామర్లకోటలో డీఆర్ఎం పర్యటన


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం

సామర్లకోట, ఏప్రిల్ 27: విజయవాడ రైల్వే డివిజినల్ మేనేజర్ నరేంద్ర వి.పాటిల్ సతీసమేతంగా శనివారం సాయంత్రం ప్రత్యేక రైలులో సామర్లకోటకు చేరుకున్నారు. సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో సామర్లకోటకు చెందిన పలువురు రైల్వే ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో అమృత్‌భారత్ కార్యక్రమంలో రూ. 32 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులు అమలు తీరును డీఆర్ఎం పరిశీలించారు. ఈ సందర్భంగా సామర్లకోటకు చెందిన పలువురు రైల్వే ఉన్నతాధికారులతో డీఆర్ఎం సమీక్షించారు. ప్రయాణికులకు అందుతున్న వివిధ సేవలపై సమీక్షించిన డీఆర్ఎం మరిన్ని సేవలందించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం సామర్లకోటలోని పంచారామ పుణ్యక్షేత్రమైన కుమార రామ భీమేశ్వరాలయం చేరుకుని స్వామివారికి, బాలా త్రిపుర సుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు స్వాగతం పలికి ఆలయ పురాతన విశిష్టతపై సమగ్రంగా డీఆర్ఎం దంపతులకు వివరించారు. అనంతరం ప్రసాదాలు, స్వామి, అమ్మవారి చిత్రపటాలను, శేష వస్త్రాలను డీఆర్ఎం దంపతులకు అందజేశారు. రైల్వే అధికారులు శివప్రసాద్, అనంతలక్ష్మి, కేవీ గిరి, బీవీ. రామసుబ్బారావు, ఎం.రవికాంత్, ఏజేవీవీఎస్ నారాయణరాజు, ఏవీకె సంతోష్‌కుమార్, ఏ. బసవేశ్వరరావు, జీకేఎస్. శ్రీదేవి బొట్టా లోవరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

రెండు రోజులు పవన్ రోడ్‌షో

29, 30 తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో పర్యటన

పిఠాపురం, ఏప్రిల్ 27: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 29,30వ తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ శనివారం మీడియాకు తెలియజేశారు. 29వ తేదీ ఉదయం 8 గంటలకు గొల్లప్రోలు మండలం చెందుర్తి నుంచి రోడ్‌షో ప్రారంభించి కొడవలి, వన్నెపూడి, మీదుగా పిఠాపురం మండలంలోకి ప్రవేశించి వెల్దుర్తి, పి.తిమ్మాపురం, బి.కొత్తూరు, గోకివాడ, జములపల్లి, నరసింగపురం, ఎల్ఎస్‌పురం, విరవాడ, విరవ, మల్లాం, జల్లూరు, కందరాడ, కుమారపురం గ్రామాల మీదుగా రోడ్‌షో సాగుతుందని తెలిపారు. 30వ తేదీన ఉదయం 9గంటలకు చిత్రాడలో రోడ్‌షో ప్రారంభించి గొల్లప్రోలు పట్టణంలో కొనసాగుతుందని చెప్పారు. 29వ తేదీ రోడ్‌షోలో పంట పొలాలు పరిశీలించడంతో పాటు పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్వీర్యం కావడం వలన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకుంటారని, రైతులు, ఆయా వర్గాల ప్రజలతో మాట్లాడతారని వివరించారు. టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పవన్ రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు.

రేపు కాకినాడలో పీసీసీ చీఫ్ షర్మిల రోడ్‌షో

కాకినాడ సిటీ, ఏప్రిల్ 27: ఈనెల 29న కాకినాడలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రోడ్‌షో నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం విశాఖ నుంచి రోడ్ మార్గం గుండా బయలుదేరి ఉదయం 11 గంటలకు స్థానిక అచ్చంపేట సెంటర్‌కు చేరుకుంటారు అక్కడి నుంచి కాంగ్రెస్ నేతలు, నాయకులు, కార్యకర్తలు వెంట రాగా సర్పవరం సెంటర్, భానుగుడి జంక్షన్, మెయిన్‌రోడ్, జగన్నాథపురం వంతెన, ఎంఎస్ఎన్ చార్టీస్ మీదుగా యానాం రోడ్‌లోని బాలయోగి విగ్రహం వరకు రోడ్‌షో జరపనున్నారు. అనుమతులను బట్టి స్థానిక భానుగుడి జంక్షన్ వద్ద గానీ, జగన్నాథపురం వంతెన వద్ద గానీ ప్రత్యేక వాహనంపై నుంచి షర్మిల ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి రోడ్ షో ముగించుకుని అక్కడి నుంచి రోడ్ మార్గం గుండా అమలాపురం, గన్నవరం చేరుకుని ప్రచార కార్యక్రమాల్లో సాయంత్రం 4 గంటల సమయంలో పోలవరం బయలుదేరి వెళ్తారు. ఈ రోడ్ షోలో పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజులతో పాటు కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు పాల్గొననున్నారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు పాండురంగారావు మీడియాతో మాట్లాడుతూ 29న కాకినాడలో జరగనున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రోడ్ షోలో పార్టీ నేతలు, అసెంబ్లీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయా లని కోరారు.

సముద్రంలో స్నానానికి వెళ్లి ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 27: ఓ ఇంజనీరింగ్ విద్యార్థి సముద్రంలో స్నానం చేస్తుండగా గల్లంతై మృతి చెందిన సంఘటన శనివారం సూర్యారావుపేట బీచ్‌లో జరిగింది. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం భట్నవిల్లి చిన్నవీధికి చెందిన సరిపెల్ల సురేంద్ర వర్మ(22) కాకినాడలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. స్థానికంగా హాస్టల్‌లో ఉంటున్నాడు. శనివారం సరదాగా బీచ్‌లో గడుపుదామని 25మంది సహచర విద్యార్థులతో కలిసి బస్సులో కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌కు వెళ్లారు. సముద్రంలో స్నానం చేస్తుండగా కెరటం ధాటికి సురేంద్రవర్మ కెరటాల్లో పడి గల్లంతయ్యాడు. మత్స్యకారులు రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చి గొడారిగుంటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి మరణవార్తను భట్నవిల్లిలో ఉంటున్న తల్లిదండ్రులకు తెలియజేయడంతో తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. మృతుడి తాతయ్య సూర్యనారాయణ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్ర తెలిపారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

జిల్లావ్యాప్తంగా 16లక్షల 34వేల ఓటర్లు
పెండింగ్ ఫారం-6ను పరిష్కరించిన ఆర్వోలు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 27: కాకినాడ జిల్లాలో ఓటర్ల తుది జాబితా విడుదల చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6 దరఖాస్తులను పరిష్కరించడంతో జిల్లాలో ఓటర్ల జాబితాలో ఓటర్ల లెక్క తేలిపోయింది. జిల్లావ్యాప్తంగా 16,34,122మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. వీరందరూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటుహక్కును వినియోగించుకోవచ్చునని అధికారులు ప్రకటించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 14 వరకు ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం ఇవ్వడంతో జిల్లాలో పెద్దఎత్తున ఫారం-6 దరఖాస్తులను స్వీకరించారు. వాటిని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆర్వోలు ఈనెల 25 వరకు పరిష్కరించారు. దీంతో శనివారం ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్ల సంఖ్యను ప్రకటించారు. ఇక నుంచి కొత్తఓటు నమోదు గానీ, మార్పులు గానీ చేర్పులకు గానీ అవకాశం లేదు.

నెలరోజుల క్రితం ఓటర్లు ఇలా

నెలరోజుల క్రితం మార్చి 15న అధికారులు ప్రకటించిన ఓటర్ల సంఖ్య 16లక్షల10వేలు కాగా ఇప్పుడు ఆ సంఖ్య 16లక్షల 34వేల ఓటర్లుగా పెరిగింది. కేవలం నెలరోజుల్లో 23,713మంది ఓటర్లు కొత్తగా జాబితాలో వచ్చి చేరారు. దీనిలో అత్యధికంగా యువ ఓటర్లు ఉండడం విశేషం. యువత ఓటు నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం స్వీప్ కార్యక్రమాలను నిర్వహించడంతో ఓటు నమోదు శాతం గణనీయంగా పెరిగిందని అధికారులు అంటున్నారు.

కాకినాడ రూరల్‌లో అత్యధికంగా..

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అత్యధికంగా 2,69,330మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో అత్యల్పంగా పెద్దాపురం నియోజకవర్గంలో 2,15,095మంది ఓటర్లు ఉన్నారు. తుని నియోజకవర్గంలో 2,24,538 ఓటర్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 2,17,267, పిఠాపురం నియోజకవర్గంలో 2,36,409, కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,41,620 మంది ఓటర్లు, జగ్గంపేటలో 2,29,863 మంది ఓటర్లు ఉన్నారు.

టాటా గ్లూకోజ్ పంపిణీ

సామర్లకోట, ఏప్రిల్ 27: సామర్లకోటలో శనివారం రాత్రి జరిగిన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ బహిరంగ సభ సందర్భంగా జనసేన పార్టీ అభిమా నులు సౌజన్యంతో కార్యకర్తలకు పది వేల టాటా గ్లూకోజ్ పానీయాలను పంపిణీ చేశారు.

ఎంపీగా ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలని ప్రచారం

కాకినాడ సిటీ ఏప్రిల్ 27: జనసేన కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను గ్లాసు గుర్తుపై ఓట్లు వేసి ఎంపీగా గెలిపించాలని జనసేన నేతలు ప్రచారం నిర్వహించారు. కాకినాడ జగన్నాథపురంలోని చంద్రిక థియేటర్, పరదేశమ్మపేట, నాగరాజుపేట, పప్పులమిల్లు ఏరియా, కృష్ణనగర్ ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాకినాడ నగరంలోని 25వ డివిజన్ నాయకుడు మచ్చా గంగాధర్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో పర్యటించి కూటమి ప్రభుత్వం చేపట్టే పథకాలను ప్రతి ఓటర్‌కు అర్థమయ్యేలా వివరించారు. పార్లమెంట్ అభ్యర్థిగా తంగెళ్లను గెలిపిస్తే ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ఎనలేని కృషి చేస్తారని గంగాధర్ తెలిపారు. గాజుగ్లాసు గుర్తు, సైకిల్‌గుర్తులపై ఓట్లువేసి ఎమ్మెల్యే, ఎంపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గుర్రం సుబ్బారావు, కర్రి విజయదుర్గ, లంకే కుమారి, కాలాడి సత్యవేణి, దండుప్రోలు కుమారి, ఓలేటి ధనకోటి పాల్గొన్నారు.

దుమ్ములపేటలో ప్రచారం..

కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు, కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లకు మద్దతుగా జనసేన, టీడీపీ నాయకులు స్థానిక దుమ్ములపేటలో శనివారం జోరుగా ఎన్నికల ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా ఇంటిం టికీ వెళ్లి కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా కొండబాబును, ఎంపీగా తంగెళ్ల ఉద య్‌శ్రీనివాస్‌ను గెలిపించుకోవాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నా యకులు ఎరిపిల్లి రాము, కొండ్రు దుర్గాప్రసాద్, చీకటి ఆనంద్, మోసా ఆనంద్, సూరాడ బాబీ, చోడిపిల్లి ప్రేమానంద్, ప్రసాద్ పాల్గొన్నారు. 10వ డివిజన్ టీడీపీ నాయకులు చోడిపల్లి సతీష్, మూగు రాజు వేర్వేరుగా తమ ప్రాంతాల్లో కొండబాబును ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలని జగన్నాథపురంలో ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నేతలు


సభలో మాట్లాడుతున్న కాకినాడ ఎంపీ జనసేన అభ్యర్థి తంగెళ్ల ఉదయ్


సభలో మాట్లాడుతున్న కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ

'కాకినాడ బీచ్‌ను అభివృద్ధి చేస్తాం'

కాకినాడ రూరల్‌లో పచ్చటిపొలాలు, ఇక్కడి కాకినాడ పోర్టును, బీచ్‌ను అభివృద్ధి చేస్తామని కాకినాడ రూరల్ జనసేన సభలో కాకినాడ ఎంపీ ఉమ్మడి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్, రూరల్ నియోజకవర్గ జనసేన ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ అన్నారు.

అభివృద్ధికి చిరునామా టీడీపీయే

» పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



సామర్లకోట, ఏప్రిల్ 27: అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా టీడీపీయేనని పెద్దాపురం కూటమి ఉమ్మడిఅభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్ల కోటలో శనివారం పవన్‌కళ్యాణ్ బహిరంగ సభకు చేస్తున్న ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబుతో కలిసి సామర్లకోట స్టేషన్ సెంటర్‌వద్ద సభా వేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలోనే పెద్దాపురం నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్న విషయం ఈ ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన ద్వారా ప్రజలు గుర్తించారన్నారు. గడిచిన ఐదేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయా యన్నారు. గ్రామాలకు ఇసుక అందుబాటులో ఉన్నా వైసీపీ విధానాల కారణంగా ఇసుకను ఇళ్ల నిర్మాణాలకు వాడుకోలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. తప్పుడు మైనింగ్ పాలసీల ద్వారా ఇసుకను అక్రమార్కులు వేల రూపాయలకు అమ్ముకుని సొమ్ములు చేసుకున్నారన్నారు. చంద్రబాబు రూపొందించిన మేనిఫెస్టో ప్రకారం తెలుగుదేశం అధికారంలోకి రాగానే వృద్ధులకు రూ.4వేల పెన్షన్‌తోపాటు ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు అదనంగా రూ.3వేలు కలిపి తొలినెలలో రూ.7వేలు ఇంటివద్దకే అందిస్తారన్నారు. బీసీలకు 50ఏళ్లకే పింఛన్ అందిస్తామన్నారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా అన్ని వర్గాల సంక్షేమానికి టీడీపీ కృషి చేస్తుందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు వచ్చే వరకూ నిరుద్యోగ భృతి యువకులకు అందిస్తామన్నారు. రైతులకు పంటపెట్టుబడి కింద రూ.20వేల ఆర్థికసాయం అందిస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సజావుగా జరగాలి

ఎన్నికల పరిశీలకులు గణేశ్, రాజేశ్ జోగ్‌పాల్‌లు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 27: ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సజావుగా జరిగేలా మైక్రో అబ్జర్వర్లు కృషి చేయాలని కాకినాడ జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎస్.గణేశ్, రాజేశ్‌జోగ్‌పాల్ ఆదేశించారు. కాకినాడలో ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జడ్పీ సమావేశ మందిరంలో శనివారం మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వీరు మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించాలన్నారు. రిపోర్టులు సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ జిల్లాలో 356 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని ఈ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లు సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సంఘటనలు సంభవించినా జిల్లా పరిశీలకుల దృష్టికి తీసుకురావాలన్నారు. ట్రైనీ కలెక్టర్ భావన, డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

పవన్‌పై అభిమానంతో..

» రాజాం-పిఠాపురం వరకు పాదయాత్రగా..

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 27: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై అభిమానంతో విజయనగరం జిల్లా రాజాంకు చెందిన తాపీమేస్త్రి వందాన శేఖరనాయుడు పిఠాపురం నియోజకవర్గం వరకూ పాదయాత్ర నిర్వహించారు. ఈనెల 15న రాజాంలో కాలినడకన బయలుదేరి 21న పిఠాపురంనియోజకవర్గంలోకి ప్రవేశించాడు. గొల్లప్రోలు,పిఠాపురం,కొత్తపల్లి మండలాల్లో పాదయాత్రగా తిరుగుతూ పవన్‌కు మద్దతుగా ప్రచారం సాగించాడు. శనివారం చేబ్రోలులోని పవన్ నివాసంవద్దకు వచ్చాడు. పవన్‌ను కలవాలని భావిస్తున్నట్లుతెలిపాడు. పవన్‌పై ప్రజల్లో ఎనలేని అభిమానం ఉందని, టీడీపీనేతవర్మ త్యాగం గొప్పదని అన్నాడు.


పిఠాపురం వరకు పాదయాత్ర చేస్తూ వచ్చిన తాపీమేస్త్రి వందాన శేఖర్‌నాయుడు

నూతన మార్పులపై అవగాహన పెంపొందించుకోవాలి

» రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ హరినాథ్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 27: ప్రస్తుత రోజుల్లో ఇన్‌కంటాక్స్(ఐటీ), జీఎస్టీ, ట్యాక్స్ అసెస్‌మెంట్ రంగాల్లో వచ్చిన నూతన మార్పులను అవగాహన పెంపొందించుకుని సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్.హరినాథ్ అన్నారు. కాకినాడ దంటు కళాక్షేత్రంలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ ఒకరోజు సదస్సుకు జస్టిస్ హరినాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ పేమెంట్స్ ర్యాంకింగ్‌లో భారతదేశం తొలిస్థానంలో ఉందన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బీఎస్ సీతాపతిరావు మాట్లాడుతూ కొత్తగా డిగ్రీ చదివి ఈ వృత్తిలోకి వచ్చేవారికి తమ అసోసియేషన్ ద్వారా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ సౌత్‌జోన్ చైర్మన్ రామరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ సౌత్ జోన్ పరిధిలోని ఆరు రాష్ట్రాల్లో ప్రతినెలా ఒక రాష్ట్రంలో ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ సదస్సు నిర్వహించి ఇన్‌కంట్యాక్స్, జీఎస్టీ, ట్యాక్స్ అసెస్‌మెంట్ రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, చట్టాల్లో వచ్చిన మార్పులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏపీ ట్యాక్స్ బార్‌అసోసియే షన్ అధ్యక్షుడు ఎంవీజేకే కుమార్ మాట్లాడుతూ కొత్తచట్టాలపై అవగాహన పెంచుకుని వృత్తి పరంగా ఉన్నతస్థానాలకు ఎదగాలన్నారు. ఏపీటీపీసీఏ ప్రధాన కార్యదర్శి యుఎస్ఎన్ రాజు, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ కార్యదర్శి చక్రరమణ, కోశాధికారి పీఎస్ ఆర్‌కే ఫణికుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎ.భానుజీరావు, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ ఎంఎస్ రావు, రాజమహేంద్రవరం సీనియర్ న్యాయవాది శర్మ, కాకినాడ సీనియర్ ట్యాక్స్ కన్సల్‌టెంట్ ఏవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ హరినాథ్

ప్రశాంతంగా ఏపీ పాలిసెట్ ప్రవేశ పరీక్ష

కాకినాడ రూరల్, ఏప్రిల్ 27: ఏపీలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకోసం నిర్వహించే ఏపీ పాలిసెట్-2024 ప్రవేశ పరీక్షను శనివారం ప్రశాంతంగా జరిగింది. కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్రాపాలిటెక్నిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి కాకినాడ అర్బన్, రూరల్ పరిధిలోని 27 పరీక్షాకేంద్రాల్లో 9,573మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 8846 మంది విద్యార్థులు హాజరైనట్లుపాలిసెట్ జిల్లా సమన్వయకర్త నల్లి జనార్దనరావు తెలిపారు. పరీక్ష ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1గంటవరకూ జరిగిందని మొత్తం 92.41శాతం విద్యార్థులు హాజరయ్యారన్నారు. వారిలో 5539 మంది బాలురకు గానూ 5146 మంది, 4034 మంది బాలికలకు గానూ 3700 మంది హాజరైనట్లు కోఆర్డినేటర్ తెలిపారు.

శృంగారవల్లభస్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, ఏప్రిల్ 27: మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో పోటెత్తారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,43,130, అన్నదాన విరాళాలు రూ.48,110, కేశఖండన ద్వారా రూ.12,960 తులాభారం రూ.300 కానుక ద్వారా రూ.8 వేలు వెరసి రూ.3,12,500 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపాయి. సుమారు 10 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారన్నారు.

రౌడీయిజం నుంచి కాకినాడను కాపాడుకోవాలి

» కాకినాడ సిటీ టీడీపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు » 44వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం





44వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో కొండబాబు, వాకర్స్ సభ్యులను ఓట్లు అభ్యర్థిస్తున్న కొండబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 27: దోచుకో.. దాచుకో.. నినాదంతో ఎమ్మెల్యే ద్వారంపూడి కాకినాడ నగరంలో అరాచక పాలన సాగించాడని..గంజాయి, రౌడీయిజం నుంచి కాకినాడను కాపాడుకోవాలని కాకినాడ సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన 44వ డివిజన్ శారదా దేవి ఆలయం పరిసర ప్రాంతాల్లో పర్యటించి సూపర్‌సిక్స్ పథకాలను స్థానిక ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడ నగర ప్రజలకు ఒరిగిందేమీలేదని, తన అక్రమ సంపాదన కోసం కాకినాడ నగర అభివృద్ధిని ఎమ్మెల్యే ద్వారంపూడి భ్రష్టు పట్టించాడన్నారు. గంజాయి, రౌడీయిజం, భూకబ్జాలు, దోపిడీదారులకు అడ్డాగా మార్చి విచ్చలవిడిగా దౌర్జన్యాలు చేశాడన్నారు. నగర ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన కష్టార్జితాన్ని దుర్వినియోగం చేసి, స్మార్ట్‌సిటీ నిధులను దోచుకుని కాకినాడ కార్పొరేషన్‌ను దివాలా స్థితికి తెచ్చాడన్నారు. నగరంలో గంజాయి, రౌడీయిజాన్ని రూపుమాపి కాకినాడ స్మార్ట్‌సిటీకి పూర్వవైభవం తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేయడం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్, జనసేన సిటీ నాయకుడు సంగిశెట్టి అశోక్, డివిజన్ నాయకులు బొల్లోజు ఉమామహేశ్వరరావు, కలిదిండి సురేష్, ఇమ్మిడిశెట్టి వెంకటరమణ, తోట కుమార్, బిరదా ప్రభావతి, ఇమ్మిడిశెట్టి రమణమ్మ, ముల్లేటి భవవాన్, రాయుడు నాగేశ్వరరావు, అగ్రహారపు సతీష్, కాళ్ల సత్తిబాబు, బల్లంకి రాజ్‌కుమార్, రాయుడు సుధాకర్, అంకం నాయుడు, పల్లా లక్ష్మి, టీడీపీ, జనసన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వాకర్స్‌ను ఓట్లు అభ్యర్థించిన కొండబాబు

ప్రశాంత కాకినాడ నగరానికి పూర్వస్థితికి తెచ్చేందుకు ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని కాకినాడ సిటీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక పీఆర్ కాలేజీ గ్రౌండ్‌లో శనివారం ఉదయం వాకర్స్ సభ్యులను కలిసి ఆయన ఓట్లు అభ్యర్థించారు. 16వ డివిజన్‌లో కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్న కుమారుడు వనమాడి శివప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కొండబాబు కుమారుడు ప్రచారం

కాకినాడ సిటీ టీడీపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కుమారుడు వనమాడి మోహన్‌వర్మ రేచెర్లపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో సిటీ ఎమ్మెల్యేగా కొండబాబును సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.



రేచెర్లపేటలో ప్రచారం నిర్వహిస్తున్న మోహన్‌వర్మ

ఎంసీఎంసీ పనితీరు పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే ప్రకటనలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ భావన

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 27: జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమాచార కేంద్రాన్ని, మీడియా మోనిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) పనితీరును ట్రైనీ కలెక్టర్ భావన శనివారం పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఇస్తున్న ప్రచార అనుమతులను పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్నికలపై వివిధ దినపత్రికల్లో ప్రచురితమైన వార్తల వివరాలను ఆరా తీశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురించిన ప్రకటనలు సంబంధిత వ్యయ బృందాలు పంపించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంసీఎంసీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది విధులను సమాచారశాఖ డీడీ నాగార్జున ఆమెకు వివరించారు. అనంతరం ఎంసీఎంసీ ద్వారా ప్రీ సర్టిఫికేషన్‌లో కొన్నింటిని ఆమె తిలకించి అభ్యంతరకర దృశ్యాలను గుర్తించి తొలగించాలని ఆదేశించారు. ఎంసీఎంసీ సభ్యులు కృష్ణమూర్తి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్వర్మేషన్ ఇంజనీర్ బాబూరావు పాల్గొన్నారు.

పెద్దాపురం: ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, వీవీటీ, వీఎస్టీ బృందాల కోసం ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన పరిశీలించారు. ఆర్వో సీతారామారావు పాల్గొన్నారు.

ముగిసిన టెక్నికల్ సింపోజియం

జేఎన్టీయూకే, ఏప్రిల్ 27: వర్శిటీలోని ఈసీఈ సెమినార్ హాల్లో యూసీఈకే ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 2 రోజుల పాటూ నిర్వహించిన జాతీయస్థాయి ఇస్పార్క్స్-2024 టెక్నికల్ సింపోజియం శనివారం సాయంత్రం ముగిసింది. కార్యక్రమంలో యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలకు, నూతన ఆలోచనలకు ఇటువంటి కార్యక్రమాలు మంచి వేదికలుగా నిలుస్తాయన్నారు. సింపోజియంలో భాగంగా లేటక్స్, పీసీబీ డిజైన్, కేడెన్స్ అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. కన్వీనర్ లీలాకుమారి, కోఆర్డినేటర్ కేజేరాణి, డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

తుని రూరల్, ఏప్రిల్ 27: నిర్లక్ష్యంగా లారీని నడిపి ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి 18నెలలు జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి కం జుడీషియల్ మేజిస్ట్రేట్ విధిస్తూ తీర్పు ఇచ్చారు. 2019వలో తేటగుంట జాతీయ రహదారిపై లారీ నిర్లక్ష్యంగా నడపుడూ బైక్‌ని ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. ఘటనపై అప్పట్లో తుని రూరల్ స్టేషన్లో కేసు నమోదు చేసి కోర్టుకు సమర్పించడంతో వాదోపవాదాల అనంతరం నిందితుడు గుంటూరు జిల్లా పురుషోత్తం గ్రామానికి చెందిన జొన్నగడ్డ పద్మరాజుకు శిక్ష ఖరారు చేశారు. కేసు వాదించిన ఏపీపీసునీత, డీఎస్పీ లతాకుమారి, సీఐ ఎస్.మూర్తి, ఎస్ఐ రమేష్‌బాబులను ఎస్పీ అభినందించారు.

చెక్‌పోస్టుల తనిఖీలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 27: నియోజకవర్గంలోని ఎన్నికలకు సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన నెల్లిపూడి, యర్రవరం, కృష్ణవరం చెక్‌పోస్టులను శనివారం ఎన్నికల అధికారులు పరిశీలించారు. చెక్‌పోస్టుల వద్ద ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించి ఏర్పాటు చేసిన చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. సీఐ శేఖర్‌బాబు, ఎన్నికల అధికారులున్నారు.

జగ్గంపేట: నియోజవర్గంలోని కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద చెక్‌పోస్టు ప్రత్యేకాధికారి డీఈ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో రోజూ వాహనాలు తనిఖీ చేస్తున్నారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

పెద్దాపురం, ఏప్రిల్ 27: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఈనెల 28 నుంచి వేసవి శిక్షణా శిబిరం నిర్వహించడం జరుగుతుందని పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ తెలిపారు. శిబిరం మే నెల 12వ వరకూ జరుగుతుంద న్నారు. గుర్రపు స్వారీ, యోగా, స్విమ్మింగ్, క్రికెట్, స్కేటింగ్, రోబోటిక్స్, గణితం, ఇంగ్లీష్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారని, 4 నుంచి 9వ తరగతి వరకూ విద్యార్థులు పాల్గొన వచ్చున్నారు. వివరాలకు 9247739333లో సంప్రదించాలన్నారు.

వేసవి శిక్షణా తరగతులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 27: గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తామని స్థానిక గ్రంథాలయ పాలరులు కవికొండ సత్యనారాయణ తెలిపారు. ఈ తరగతులు ఈనెల 29 నుంచి జూన్ 6 వరకు జరుగుతాయన్నారు. గ్రంథాలయాలలో ఉపాధ్యాయులతో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనాలన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ఏలేశ్వరం, ఏప్రిల్ 27: సిరిపురంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పెదపాటి ముసలయ్య కుటుంబానికి 25 కిలోల బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులను శనివారం శ్రీస్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మైరాల నాగేశ్వరరావు, కొల్లా శ్రీనివాస్, కుర్ర గోవిందు, సాయి, అడపా శివ ప్రసాద్ పాల్గొన్నారు.

పేపర్ మిల్లు ఉద్యోగి అనుమానాస్పద మృతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పేపరు మిల్లు ఉద్యోగి అనుమానాస్పద మృతిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జగన్నాథపురానికి చెందిన చెల్లుబోయిన విజయ్‌భార్గవ్(39) పేపరు మిల్లులో 2013 నుంచి సివిల్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. భార్యతో పేపరు మిల్లు క్వార్టర్సులో నివాసం ఉంటున్నాడు. రెండేళ్ల క్రితం కుటుంబ తగాదాలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో భార్గవ్ క్వార్టరులో ఒంటరిగా ఉంటున్నాడు. శనివారం ఉద్యోగానికి వెళ్లకపోవడంతో సాయంత్రం 4గంటల ప్రాంతంలో సహోద్యోగి వచ్చి తలుపు కొట్టగా తీయలేదు. కిటికీలోంచి చూడగా భార్గవ్ నిర్జీవంగా కిందపడి ఉన్నాడు. ఆ సహోద్యోగి సమాచారంతో పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఫిట్స్, గుండె సంబంధిత వ్యాధులతో భార్గవ్ బాధ పడుతున్నాడని.. అనారోగ్య సమస్యల వల్ల ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని సీఐ అన్నారు.

రానున్నది కూటమి ప్రభుత్వమే

యనమల రామకృష్ణుడు



టీడీపీలో చేరినవారితో యనమల రామకృష్ణుడు

తుని రూరల్, ఏప్రిల్ 27: రానున్నది కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం వైసీపీకి రాజీనామా చేసి పలువురు కార్యకర్తలు టీడీపీలోకి చేరగా వారికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీలోకి చేరిన వారిలో లోవకొత్తూరు గ్రామానికి చెందిన తొర్ర సతీష్ బొడ్డు మహేష్, మట్ల తాతబాబులతో పాటుగా పలు కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి నాగ సోమరాజు,దూలం మాణిక్యం, యాదాల లోవకృష్ణ, వంగలపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

రామచంద్రపురం అభ్యర్థి వాసంశెట్టి శుభాష్



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వాసంశెట్టి

కాజులూరు, ఏప్రిల్ 27: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని రామచంద్రపురం అభ్యర్థి వాసంశెట్టి శుభాష్ పేర్కొన్నారు. కాజులూరు మండలం పెనుమళ్ళ, తనుమళ్ళ, అంద్రంగి, చేదువాడ గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీధుల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు పేపకాయల బాబ్జి, జనసేన మండలాధ్యక్షుడు బొండా వెంకన్న, బీజేపీ మండలా ధ్యక్షుడు సలాది వీరబాబు, వనుం వీరబ్రహ్మం, గుబ్బల ఏసురాజు పాల్గొన్నారు.

'కూటమి గెలుపుతో కష్టాలు దూరం'

తొండంగి, ఏప్రిల్ 27: టీడీపీ కూటమి విజయంతో ప్రజల కష్టాలు దూరమవుతాయని తుని అభ్యర్థి యనమల దివ్య అన్నారు. శనివారం ఆమె ఒంటిమామిడి గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మాట్లాడుతూప్రజలంతా వైసీపీని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, యనమల రాజేష్, అంగులూరి సుధాకర్, అరిగెల నర్సింహమూర్తి, కొయ్యా రామకేశవ, పిర్ల శివ తదితరులున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

గండేపల్లి, ఏప్రిల్ 27: నీలాద్రిరావుపేటలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ వారికి టీడీపీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఎన్నికల్లో జగ్గంపేట ఎమ్మెల్యేగా జ్యోతుల నెహ్రూను, కాకినాడ ఎంపీగా తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలవడం తథ్యమన్నారు. నీలాద్రిపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, గ్రామ టీడీపీ అధ్యక్షులు కురుకూరి వీర వెంకట చౌదరి, తంగెళ్ల అప్పారావు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరికలు

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 27: ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి జనసేనలో చేరారు. మండలంలోని కుమారపురం గోకులం గ్రాండ్‌లో శనివారం ఆ పార్టీ నాయకులు మాల్యాద్రి, కృష్ణ, మధు, వెంకటేశ్వర్లు, మాలకొండయ్య వసంతరావు, బాలకృష్ణలు జనసేన నేత నాగబాబు సమక్షంలో పార్టీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. ఉమ్మడి ప్రకాశం జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు. కాకినాడకు చెందిన ఉడతల చక్రి, వై.శ్రీనివాస్, నాగబాబు, నాని పార్టీలో చేరారు.

'ఈవీఎంలపై అవగాహన ఉండాలి'

పెద్దాపురం, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రధానమైన ఈవీఎంల పనితీరుపై పీవోలు, ఏపీవోలకు పూర్తి అవగాహన ఉండాలని రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఈవీఎంల ర్యాండమైజేషన్, సీల్ వేయడం తదితర విషయాలపై పోలింగ్ అధికారులకు ఆయన శనివారం అవగాహన కల్పించారు. మాక్‌పోల్ నిర్వహణ, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌ల ఉపయోగం, ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై పీవోలు, ఏపీవోలు అవగాహన ఉండాలన్నారు. తహశీల్దార్లు ఎస్.శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

బంగారు బాట వేసే చంద్రబాబును గెలిపించాలి

జగ్గంపేట టీడీపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

జడ్.రాగంపేటలో నూతన ఓటర్లతో ముఖాముఖి



గండేపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

గండేపల్లి, ఏప్రిల్ 27: భవిష్యత్‌కు బంగారు బాట వేసే చంద్రబాబును సీఎంగా తొలి ఓటుతో గెలిపించాలని జగ్గంపేట టీడీపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు తేజస్విని అన్నారు. శనివారం మండలంలోని జడ్.రాగంపేటలో టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు అధ్యక్షతన నూతన ఓటర్లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. నెహ్రూ మాట్లాడుతూ ఇవి తనకు చివరి ఎన్నికలని, రాబోయే ఐదేళ్లలో ప్రజలకు అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు పరుస్తానన్నారు. తేజస్విని మాట్లాడుతూ రాళ్ల గుటట్టలను హైటెక్ సిటీగా మలిచి రెండు లక్షల కోట్లతో ఐటీ గ్రోత్ సాధించిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు సాయితేజ, పరిమిబాబు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, కొత్త కొండబాబు, జాస్తి వసంత్, సుంకవిల్లి రాజు, బొల్లంరెడ్డి రామకృష్ణ, అడబాల భాస్కరరావు, అడబాల రామాంజనేయులు, కందుల బాబ్జి, పాలకుర్తి ఆదినారాయణ, కంటిపూడి సత్తిబాబు, కేతిన వెంకన్నచౌదరి, దాపర్తి సీతారామయ్య, దిడ్డి శ్రీను, యర్రంశెట్టి బాబ్జి, కుంచే రామకృష్ణ, వెలమాటి కాశీ, తమటం వీరభద్రరావు, యల్లమిల్లి సీఎం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



జగ్గంపేట: అన్నమయ్యకు టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న నెహ్రూ

జగ్గంపేట మండలం వెంగయమ్మపురం వైసీపీ నాయకుడు అన్నమయ్య ఆ పార్టీకి రాజీనామా చేసి జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. అన్నమయ్య మాట్లాడుతూ వైపీపీ వ్యతిరేక పాలననచ్చక ఈ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే జ్యోతుల నెహ్రూ లాంటి అనుభవశాలి ఎమ్మెల్యేగా గెలవాలని ఉద్దేశ్యంతో టీడీపీలో చేరుతున్నానని, త్వరలో మా అనుచరులు అందరూ కూడా టీడీపీ అవుతారన్నారు.

ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, వల్లెపు అన్నవరం, మాజీ ఎంపీటీసీ అప్పన వీరబాబు, దశరధ శ్రీను ఉన్నారు.

జ్యోతుల మణి ప్రచారం

ఇరిపాక గ్రామంలో జగ్గంపేట కో ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ మాజీ చైర్మన్, జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సతీమణి జ్యోతుల మణి ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల్లో టీడీపీ కూటమిని అభ్యర్థులైన జ్యోతుల నెహ్రూ ఎమ్మెల్యేగా, ఎంపీగా ఉదయ్ శ్రీనివాసులను గెలిపించాలని మహిళలను కోరారు. జనసేన, టీడీపీ, నాయకులు ఉన్నారు.

తోట సునీత ప్రచారం

కిర్లంపూడి: శృంగరాయునిపాలెం గ్రామంలో సర్పంచ్ పట్టు చంటిబాబు, ఎంపీటీసీ గరగా గోవిందు, ఉపసర్పంచ్ బొజ్జపు శ్రీను ఆధ్వర్యంలో టీడీపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత ఇంటింటా టీడీపీ ప్రచారం నిర్వహించి అత్యధిక మెజార్టీతో కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, భూపాలపట్నం ప్రసాద్, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, బస్వా వీరబాబు, గొడే బాలా, తిరుమల సత్యానందం, అల్లుమల్ల బాబి, బొజ్జపు నాగేశ్వరరావు, వెంకన్న, కరణం బూరయ్య, బుర్రే శ్రీను, కాళిదాసు, కుంచే రాజా, కంచుమర్తి రాఘవ ఉన్నారు.



కిర్లంపూడి: ప్రచారం నిర్వహిస్తున్న తోట సునీత

మద్యం షాపు వద్ద మాజీ ఎమ్మెల్యే వర్మ నిరసన



పిఠాపురంలో మద్యం బాటిళ్లతో నిరసన తెలుపుతున్న వర్మ

పిఠాపురం, ఏప్రిల్ 27: ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు వైసీపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో పట్టణంలోని సినిమాసెంటర్ వద్ద గల ప్రభుత్వ మద్యం షాపు వద్ద మద్యం బాటిళ్లతో శనివారం నిరసన తెలిపారు. వర్మ మాట్లాడుతూ పిఠాపురంలో నాలుగు చోట్ల కోటి రూపాయిల విలువైన మద్యం పట్టుబడిందని, అవన్నీ వైసీపీ నేతల గృహాలేనని చెప్పారు. నియోజకవర్గంలో రూ.7 కోట్లు విలువైన మద్యం ఉందని ఆరోపించారు. ఇప్పటికే కడపకు చెందిన వ్యక్తులు గొల్లప్రోలులో ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారని, పిఠాపురంలోని వైఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆరు ఇళ్లు అద్దెకు తీసుకున్నారని తెలిపారు. ఇంటికి లక్ష రూపాయిలు పంచేందుకు వైసీపీ సిద్ధపడుతున్నదని ఆరోపించారు. మద్యం దొరికన ఇళ్లకు సంబంధించిన వైసీపీ నేతలతో పాటు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను అరెస్టు చేయాలని, డబ్బు ఎక్కడ దాచారో పోలీసులు వెలికితీయాలని డిమాండ్ చేశారు.

పించన్ పంపిణీ చేయాలి

సామాజిక భద్రతా పించన్లను ఇంటింటికి వెళ్లి అందజేయాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మున్సిపల్ కమిషనరుర్ వినతి అందజేశారు.

'మా ఓట్లన్నీ పవన్‌కే'

కొత్తపల్లి, ఏప్రిల్ 27: ఎన్నికల్లో మా ఓట్లన్నీ టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పవన్‌కళ్యాణ్, ఎంపీ అభ్యర్థి తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్‌కేనని కొమరగిరి దళితపేట మహిళలు స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్‌వర్మ ఆధ్వర్యంలో శనివారం కొమరగిరిలో ఇంటింటా ఉమ్మడి అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రచారంలో టీడీపీ నాయకుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, సర్పంచ్ డాక్టర్ కండిపల్లి సత్య శ్రీ, మాజీ ఎంపీటీసీ నూకరాజు, సానా నాగు, మురాలశెట్టి సునీల్‌కుమార్ తదితర జనసైనికులు ఉన్నారు.

ప్రత్తిపాడు అభివృద్ధే లక్ష్యం : వరుపుల సత్యప్రభ



ఒమ్మంగిలో ప్రచారం నిర్వహిస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 27: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద శనివారం గిడదాం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. మండలంలోని ఒమ్మంగి గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని తెలిపారు. ఒమ్మంగి ప్రచారంలో మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతబాబు, టీడీపీ నాయకులు రామిశెట్టి మునిసిబ్, కొప్పన సీతారాముడు, కొప్పర రాజబాబు, జల్దరపు వెంకటేశ్వరరావు, రాయుడు రాజబాబు, పాల్గొన్నారు. గిడదాం టీడీపీ నాయకులు పునుగు సూరిబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరినవారిలో జల్లూరి చిన్నారి, అమ్మాజీ, బీరప్రసాద్, చిట్టిమూరి నాని, సునీల్‌కుమార్, రాజా, కిషోర్, డేవిడ్‌రాజ్, రాజేష్ ఉన్నారు. అలాగే టీడీపీ కాకినాడ జిల్లా టీడీపీ లీగల్ సెల్ నాయకులు అధ్యక్షులు నాగబాబు, స్థానిక లీగల్ సెల్ అధ్యక్షుడు బంగుశూరి మధుబాబు, పలువురు కార్యకర్తలు సత్యప్రభను కలిసి సంఘీభావం తెలిపారు. మండలంలోని టి.రాయవరం గ్రామంలో సత్యప్రభ కుమార్తె సత్యమాధురి ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో సర్పంచ్ తటవర్తిసుబ్బారావు, మహిళలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో బుల్లితెర నటుడు ఇంద్రనీల్ ప్రచారం



ఇందిరాకాలనీలో కరపత్రాలు అందజేస్తున్న ఇంద్రనీల్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 27: ప్రత్తిపాడులో శనివారం సాయంత్రం బుల్లితెర నటుడు ఇంద్రనీల్ వర్మ (చక్రవారం సీనియరల్ హీరో) ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రత్తిపాడు కూట మి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా, పార్లమెంట్ అభ్యర్థి తం గెళ్ల ఉదయ శ్రీనివాస్‌లకు మద్దతుగా గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంద్రనీల్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతూ అన్ని వర్గాల ప్రజలు సతమతమతుతున్నారని, ఈ ప్రభుత్వాన్ని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, మాజీ సర్పంచ్‌లు ఎంఎస్‌వీ ప్రసాద్, యాళ్ళ విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ శెట్టిబత్తుల వీరబాబు, స్థానిక టీడీపీ నాయకులు మదినే దొరబాబు, రావూరి తాతాజీ, పోలిశెట్టి శ్రీనివాస్, శెట్టిబత్తుల నాని, మాజీ ఎంపీటీసీ చిలకమర్తి వీరభద్రం పాల్గొన్నారు.

'పవన్ బహిరంగ సభను విజయవంతం చేయాలి'

ఏలేశ్వరం, ఏప్రిల్ 27: జనసేన అధినేత పవన్ కల్యాణ్ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ కూటమి ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సత్యప్రభ, జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ వారాహి యాత్రలో భాగంగా ఆదివారం పవన్ హెలికాప్టర్లో మధ్యాహ్నం 3గంటలకు ఏలేశ్వరం చేరుకుని వారాహి వాహనంపై నుంచి బాలాజీ చౌక్ సెంటర్‌లో ప్రసంగిస్తారని తెలిపారు. జనసేన-టీడీపీ-బీజేపీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. లింగంపర్తి రోడ్డులో హెలిప్యాడ్ వద్ద టీడీపీ నాయకులు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి ఏర్పాట్లు పరిశీలించారు. పవన్ సభ సందర్భంగా భారీ బందోబస్తు నిర్వహిసున్నట్లు పట్టణ ఎస్ఐ సతీష్ తెలిపారు.

జగ్గంపేట: ఆదివారం కిర్లంపూడిలో జరిగే జనసేన అధినేత పవన్‌కల్యాన్ బహిరంగ సభకు సంబంధించి జగ్గంపేట పరిణయ ఫంక్షన్‌హాల్లో నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, జగ్గంపేట బీజేపీ ఇన్‌చార్జ్ దాట్ల కృష్ణ వర్మ, బీజేపీ నాయకురాలు కామినేని జయశ్రీ, జిల్లా ఎన్నికల కోఆర్డినేటర్ తోట నవీన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 6గంటలకు కిర్లంపూడి సత్యదేవ కల్యాణ మండపం ఎదురుగా పవన్‌కల్యాణ్ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్వీఎస్ అప్పలరాజు, తోట రవి, జనపరెడ్డి బాబు, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, చదరం చంటిబాబు, మంగరౌతు రామకృష్ణ పాల్గొన్నారు.

సభాస్థలి పరిశీలన

కిర్లంపూడి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం కిర్లంపూడిలో వారాహి రోడ్ షో నిర్వహించనున్నారు. కిర్లంపూడి సత్యదేవా కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసే బహిరంగసభలో పవన్ ప్రసంగించనున్నారు. శనివారం సభాస్థలిని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరిశీలించారు.

నల్లమిల్లి కుమార్తె ఎన్నికల ప్రచారం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 27: అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం గొల్లల మామిడాడ గ్రామం పాటిమీద శనివారం అనపర్తి నియోజకవర్గ ఎన్డీఏ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తరఫున ఆయన కుమార్తె నల్లమిల్లి సనాతని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్నికల్లో అనపర్తి అసెంబ్లీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి ఎన్నికల గుర్తు కమలంపైన, రాజమహేంద్రవరం పార్లమెంట్ ఎన్డీఏ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి ఎన్నికల గుర్తు కమలంపైన ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



చెత్త సేకరణలో అలసత్వం వద్దు

ఏడీసీ నాగనరసింహారావు



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న ఏడీసీ

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 27: చెత్త సేకరణలో అలసత్వం ఏమాత్రం ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నాగనరసింహారావు స్పష్టం చేశారు. శనివారం ఆయన 8వ సర్కిల్ పరిధిలోని సూర్యనారాయణపురం, రంగయ్యనాయుడు వీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ప్రజలు చైతన్యవంతులై రోడ్లపై, డ్రైనేజీల్లో చెత్త వేయద్దన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఉన్నారు.